

విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న ప్రొఫెసర్ లక్ష్మణ్ తదితరులు

ఆదివాసీ సంఘీభావ వేదిక కన్వీనర్ల ఎన్నిక

రాంనగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి హైదరాబాద్ ఆదివాసీ సంఘీభావ వేదిక ఆవిర్భావం జరిగింది. శుక్రవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ జి.లక్ష్మణ్ ఆధ్యక్షతన జరిగిన సమావేశం జరిగింది. సమావేశంలో ఉమ్మడి హైదరాబాద్ ఆదివాసీ సంఘీభావ వేదిక కన్వీనర్లుగా ప్రజా కళామండలి ప్రతినిధి రాణి, చైతన్య మహిళా సంఘం నేత జయ, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ నాయకుడు రవి, ఏఐఎఫ్‌టీ నాయకుడు మల్లేష్, ఐపీఎల్ నాయకుడు సురేష్‌కుమార్, పీడీఎస్‌యూ నాయకుడు మహేష్, అమరుల బంధు మిత్రుల సంఘం నేత సత్య, తెలంగాణ ప్రజా ఫ్రంట్ ప్రతినిధి రాంబాబు, కో-ఆర్డినేటర్‌గా పౌర హక్కుల సంఘం హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాస్, కన్వీనర్‌గా రైతు కూలి సంఘం నాయకుడు జి.వెంకటేశ్వరావులను నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీలపై జరుగుతున్న మారణ హోమాన్ని నిలిపివేయాలని, సహజ వనరుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. పర్యావరణాన్ని రక్షించాలని, పోలీసు క్యాంపులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల హక్కులు, సమస్యలపై చర్చించారు. ఆదివాసీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ఈ వేదిక కృషి చేస్తుందన్నారు.



సమ్మక్కసారలమ్మ ఆలయంలో పూజలు నిర్వహించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీకాంత్ ముదిరాజ్, శ్రీధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు

మేడారం జాతరకు తరలివెళ్లిన బీఆర్ఎస్ నేతలు

ముషీరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని మేడారం సమ్మక్క సారలమ్మ ఉత్సవాలకు శుక్రవారం ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తలారి శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు అమ్మవారి దర్శనానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ ముదిరాజ్ మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం రాజకీయాలకతీతంగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతలతో కలిసి సమ్మక్క సారలమ్మ గద్దెలను దర్శించుకుని పూజలు చేస్తామని తెలిపారు.

కార్యక్రమంలో ముషీరాబాద్ గాంధీనగర్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, రాకేష్‌కుమార్, నాయకులు శ్రీకాంత్ యాదవ్, బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుషాల్ గౌడ్, నగర కార్యదర్శి అనిల్ కుమార్, పార్టీ నాయకులు అశోక్‌కుమార్, నరేష్, అజయ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మ్యారేజీ బ్యూరోలకు ప్రభుత్వం సహకారం అందించాలి

● బుర్రా శ్రీనివాస్‌గౌడ్

రాంనగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మ్యారేజీ బ్యూరోలను ప్రభుత్వం గుర్తించి వారికి సహకారం అందించాలని తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బుర్రా శ్రీనివాస్‌గౌడ్ కోరారు. హిందూ వివాహ బంధం పవిత్రను కాపాడే విధంగా మ్యారేజీ బ్యూరోలు ఎంతో కృషి చేస్తున్నాయని అన్నారు. మ్యారేజీ బ్యూరోల నిర్వాహకులు సేవాభావంతో మ్యారేజీ బ్యూరోలను నిర్వహిస్తూ మంచి గుర్తింపు కోసం పాటుపడాలన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వివిధ రంగాల్లోని మహిళలు, పలు మ్యారేజీ బ్యూరో నిర్వాహకులను సత్కరించి ఆయన మాట్లాడారు. ఉగాది పర్వదినం పురస్కరించుకుని మూడు నుంచి అయిదు పెళ్లిళ్లు చేసిన మ్యారేజీ బ్యూరోలకు అవార్డులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూస శివరాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ మధుసూదన్, ఉపాధ్యక్షులు శ్యామ్‌రావు ముదిరాజ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రంజింపచేసిన భారతీయ శాస్త్రీయ నృత్యం

చిక్కడపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నృత్య శిక్షణా సంస్థ కథక్ కళాక్షేత్ర ఆధ్వర్యంలో నృత్యాంజలి పేరిట శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించిన భారతీయ శాస్త్రీయ నృత్య మహోత్సవం కార్యక్రమం రంజింపచేసింది. కళాపోషకులు సారిపల్లి కొండలరావు సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో మృణాళిని శిష్య బృందం కొలువై ఉన్నాడే దేవదేవుడు అంశానికి అనుగుణంగా చేసిన నృత్యప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. మాస్టర్ సాయి వేదాంత ఈ సందర్భంగా పేరిణి నాట్యాన్ని ప్రదర్శించారు. కథక్ నాట్యాచార్యులు, కథక్ కళాక్షేత్ర నిర్వాహకులు పండిట్ అంజిబాబు శిష్యురాలు కైవల్య కథక్ నాట్యాన్ని, ప్రియాంక మిశ్రా శిష్యురాలు రమ్య ఒడిస్సీ నాట్యాన్ని, గౌతమి శిష్యబృందం భరతనాట్యాన్ని అద్భుతంగా నర్తించి ప్రేక్షకుల హర్షధ్వానాలు అందుకున్నారు. గురురాజ్ శిష్యుడు మేధన్ష్ రాము శిష్యుడు మోక్షత్ డ్రమ్స్ విన్యాసంతో అలరించారు. అనంతరం జరిగిన సభలో యువకళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ, జర్నలిస్ట్ రఫీ, కళావిపంచి ఆర్గనైజర్ నరసింహారావు, నాట్యగురువులు నిర్మలాప్రభాకర్, పండిట్ అంజిబాబు పాల్గొని కళాకారులను అభినందించారు.



ఎఫ్‌సీఎస్ పీటర్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న విమలారెడ్డి, సుగుణమ్మ తదితరులు

ఎఫ్‌సీఎస్ పీటర్ భౌతికకాయానికి నివాళి

చిక్కడపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హెబ్రోన్ చర్చి ట్రస్ట్ వ్యవస్థాపకుడు, విశ్రాంత ఉన్నతాధికారి ఎఫ్‌సీఎస్ పీటర్ భౌతికకాయాన్ని వివిధ ప్రాంతాలనుంచి క్రైస్తవులు అధికసంఖ్యలో తరలివచ్చి సందర్శించి నివాళులర్పించారు. శుక్రవారం మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సోదరి విమలారెడ్డి, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి భారతి, మాతృమూర్తి సుగుణమ్మ, కడపకు చెందిన పలువురు పీటర్ భౌతికకాయాన్ని కడసారి చూసేందుకు తరలివచ్చారు. దీంతో చర్చి ప్రాంగణం రద్దీగా మారింది. వారు పీటర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా విమలారెడ్డి మాట్లాడుతూ ఎఫ్‌సీఎస్ పీటర్ నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. ఆయన ప్రభుత్వ ఉద్యోగిగా, హెబ్రోన్ చర్చి ట్రస్ట్ వ్యవస్థాపకుడిగా అంకితభావంతో పని చేశారన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

బర్కత్‌పుర, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలీ పండగ సందర్భంగా వైన్‌షాపులు మూసివేయడంతో ఓ వ్యక్తి రహస్యంగా మద్యం బాటిళ్లు విక్రయిస్తుండగా కాచిగూడ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కాచిగూడ కబేళా సమీపంలోని శాస్త్రీనగర్‌లో నివాసం ఉంటున్న శ్యామ్‌శంకర్ రాజోలు(35) వృత్తిరీత్యా కుక్కర్. శుక్రవారం మద్యం విక్రయిస్తుండగా పట్టుకుని అతని నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

హోలీ.. రంగోలి

- ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో ఘనంగా వేడుకలు
- చిన్న, పెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్న ప్రజలు
- వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు



రామాలయం వీధిలో రంగులు జల్లుకుంటున్న చిన్నారులు

రాంనగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో హోలీ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం రాత్రి కాముని దహనం చేసిన ప్రజలు శుక్రవారం తెల్లవారు జాము నుంచి రెండు నియోజకవర్గాలలోని కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్‌లు, పార్కులలో, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలలో కులమతాలకతీతంగా హోలీ వేడుకలు జరుపుకున్నారు. సంప్రదాయ బద్ధమైన రంగులను పూసుకుని హోలీ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. డీజేలను ఏర్పాటు చేసుకుని రంగు నీళ్లు చల్లుకుంటూ యువతీ, యువకులు సందడి చేశారు. బాగ్‌అంబర్‌పేటలో జరిగిన హోలీ వేడుకల్లో కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ, డీపీ పద్మారెడ్డిలు పాల్గొని మహిళలతో కలిసి హోలీ జరుపుకున్నారు. అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్ రామాలయం వెనుక వీధిలో జరిగిన హోలీ వేడుకల్లో ఎమ్మెల్సీ ఎం.కోదండరాం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎం.నాగేష్ ముదిరాజ్, జనసేన గ్రేటర్ అధ్యక్షుడు నర్సయ్యలు పాల్గొన్నారు. రాంనగర్ డివిజన్‌లో జరిగిన హోలీ వేడుకల్లో కార్పొరేటర్ కె.రవిచారి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు, బీజేపీ నాయకులు పార్థసారధి, రాంరెడ్డి, మద్దూరి శివాజీ, కలకోట అరుణ్ తదితరులు పాల్గొన్నారు. నల్లకుంట డివిజన్‌లోని సంజీవయ్యనగర్‌లో బీఆర్ఎస్ నాయకులు ఇర్ఫానా సుల్తాన, అనిత, స్వప్నలు హోలీ వేడుకల్లో పాల్గొని మహిళలతో కలిసి రంగులు చల్లుకున్నారు. నల్లకుంట కార్పొరేటర్ యాకర. అమృత బీజేపీ నాయకులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.

ఇందిరాపార్కు వద్ద

కవాడిగూడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఇందిరాపార్కులో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం హోలీ వేడుకలు అంబరాన్నింటాయి. హోలీ వేడుకల్లో ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, కుటుంబ సభ్యులు చిన్న, పెద్ద తేడా లేకుండా హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకల్లో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోలీ పండగ అందరి జీవితాలలో రంగులు నింపాలని కోరారు.

హోలీ సంతోషాన్ని నింపాలి

చిక్కడపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగ అందరి జీవితాల్లో సంతోషం నింపాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ అన్నారు. హోలీ పండుగ సందర్భంగా ఆమె జీహెచ్ఎంసీ మహిళా పారిశుధ్య కార్మికులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.



శివాలయం చౌరస్తా వద్ద రంగులు పూస్తున్న ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శివముదిరాజ్ తదితరులు

ముషీరాబాద్‌లో

ముషీరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలీ పండగను పురస్కరించుకొని ముషీరాబాద్ బోలక్‌పూర్‌లో హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నా పెద్దా తేడాలేకుండా మహిళలు, పిల్లలు అందరూ ఉత్సాహంగా రంగులు పూసుకుంటూ పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



అడిక్‌మెట్‌లో జరిగిన హోలీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కోదండరాం, జన సేన నాయకులు



భరత్‌నగర్‌లో రంగులు పూస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జమాల్‌పురి నందు



ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన హోలీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



ఇందిరాపార్కులో జరిగిన హోలీ వేడుకల్లో పాల్గొని కార్పొరేటర్ రచనశ్రీకి రంగులు పూస్తున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి



హోలీ వేడుకల్లో పాల్గొన్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్



హోలీ సంబరాల్లో కుటుంబ సభ్యులతో గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్



బాగ్‌అంబర్‌పేటలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ తదితరులు



రాంనగర్‌లో జరిగిన హోలీ వేడుకల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగేష్ ముదిరాజ్ తదితరులు



సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో జరిగిన హోలీ వేడుకల్లో పాల్గొన్న మహిళలు



జెమినీకాలనీలో జరిగిన హోలీ వేడుకల్లో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు తదితరులు

ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అరెస్ట్ చేయాలి

● మాదిగ దండోరా అధ్యక్షుడు సతీష్

ఖైరతాబాద్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): దళిత నాయకుడైన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచితంగా ప్రవర్తించిన సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరుతూ తెలంగాణ మాదిగ దండోరా నాయకులు సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు దేవని సతీష్ మాదిగ మాట్లాడుతూ.. స్పీకర్ హోదాలో ఉన్న గడ్డం ప్రసాద్ ఎస్సీ కులం వారని తెలిసే కించపరిచేలా మాట్లాడారన్నారు. అసెంబ్లీలో దళిత స్పీకర్‌ను అవమానించిన జగదీష్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు మేరీ మాదిగ, పాలడుగు శ్రీనివాస్, రాంచందర్ పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మాదిగ దండోరా నాయకులు

జగదీశ్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

అమీర్‌పేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్ పట్ల బీఆర్ఎస్ పార్టీ నాయకుల తీరు సరికాదని టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్స్ స్టేట్ కోఆర్డినేటర్ కమ్మగోని చౌదరిగౌడ్ అన్నారు. శుక్రవారం ఎస్ఆర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్పీకర్ స్థాయిని కించపరిచేలా బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దీన్ని బట్టి దళితులంటే వారికి ఎంత ప్రేమ ఉందో ప్రజలకు అర్థమవుతుందన్నారు. జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను అవమానపరిచారని తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.



పోలీసుల అదుపులో హాష్ ఆయిల్ తరలిస్తున్న నిందితులు

హాష్ ఆయిల్ తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

బంజారాహిల్స్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బాక్సుల్లో హాష్ ఆయిల్‌ని తరలిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు కథనం ప్రకారం.. రోడ్డు నంబర్ 10లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో కొందరు డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందింది. దీంతో రెండు రోజులుగా సిబ్బంది నిఘా పెట్టారు. ఈ నెల 13న అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేయగా 88 గ్రాముల హాష్ ఆయిల్ లభించింది. విచారణలో నిందితులు రాజేష్ చౌహాన్, ఎస్.అఖిల్‌గా గుర్తించారు. నిందితుల వద్ద ఉన్న హాష్ ఆయిల్, ద్విచక్రవాహనం, రెండు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూబ్లీహిల్స్‌లో కారు బీభత్సం

బంజారాహిల్స్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లో కారు బీభత్సం సృష్టించింది. అతి వేగంగా వెళ్తూ ఫుట్‌పాత్ పైకి దూసుకెళ్లింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మాదాపూర్ వైపు నుంచి జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 45 మీదుగా ఓ కారు బంజారాహిల్స్ వైపు వెళ్తోంది. సినీ నటుడు బాలకృష్ణ నివాసం వద్దకు రాగానే అతివేగం కారణంగా అదుపు తప్పి ఫుట్‌పాత్ పైకి ఎక్కి అక్కడున్న ఫెన్సింగ్‌ను ఢీకొట్టి ఆగిపోయింది. అదృష్టవశాత్తూ కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.ఈ ఘటనలో ఫెన్సింగ్, కారు ధ్వంసమయ్యాయి. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి కారణమైన కారు

పెళ్లి పేరుతో నమ్మించి మోసం చేసిన ఇద్దరిపై కేసు

అమీర్‌పేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిపై కేసు నమోదైంది. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన యువతి అమీర్‌పేటలోని ఓ హాస్టల్‌లో ఉంటూ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. 2022లో కుమ్మరిబస్తీకి చెందిన దాసరి దిలీప్(26)తో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత ప్రేమించుకున్నారు. రెండేళ్ల పాటు కలిసి తిరిగారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించిన దిలీప్ ఆమెను పలుమార్లు రూమ్‌కు తీసుకువెళ్లి శారీరకంగా కలిశారు. ఈ క్రమంలో పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో అతడు ముఖం చాటేసి మరో యువతితో తిరగడం ప్రారంభించాడు. దీంతో ప్రేమ, పెళ్లి పేరుతో యువతులను లొంగదీసుకుని వారి వితాలతో ఆడుకుంటున్నాడంటూ ఆ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మధురానగర్‌లో మరో ఘటన..

బోరబండ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించిన యువతిని మోసం చేసిన వ్యక్తిపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది మార్చిలో అద్దె ఇంటి కోసం శ్యామ్‌లాల్ అనే వ్యక్తి మధురానగర్ పరిధిలో వెతుకుతుండగా ఓ యువతి పరిచయమైంది. పరిచయం ప్రేమగా మారడంతో పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. దీంతో పలు మార్లు శారీరకంగా కలిశారు. ఇటీవల ఆ యువతి పెళ్లి చేసుకోవాలని శ్యామ్‌లాల్‌ను అడగ్గా తనకు ఇంతకు ముందే పెళ్లయిందని, పిల్లలు సైతం ఉన్నారని చెప్పాడు. అయినప్పటికీ తనని పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. అయితే త్వరగా పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో అతడి తల్లి, చెల్లి ఆమెను బెదిరించారు. దీంతో శ్యామ్‌లాల్‌పై చర్యలు తీసుకోవాలంటూ మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.



నల్లకుంటలో జరిగిన హోలీ వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ మహిళా నేతలు ఇర్ఫానా సూల్తాన, అనిత, స్వప్న తదితరులు

కనులపండువగా సత్యనారాయణస్వామి వ్రతాలు

చిక్కడపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని పలు ఆలయాల్లో శుక్రవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు కనులపండువగా జరిగాయి. చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు ఆర్టీసీ క్రాస్‌రోడ్ లక్ష్మీగణపతి ఆలయంలో, వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయాల్లో సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా ఆలయాల నిర్వాహకులు శ్రీనాథ్‌గౌడ్, అన్నపూర్ణ, నర్సింగ్‌రావు, లక్ష్మారెడ్డి, జానకి సుధాకర్, దేవనాథం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రజల మధ్య స్నేహభావాన్ని పెంచేది హోలీ

చిక్కడపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో స్నేహభావాన్ని పెంపొందించేది హోలీ పండుగ అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం హోలీ సందర్భంగా గాంధీనగర్ డివిజన్‌లోని పలు కాలనీలు, అపార్ట్‌మెంట్‌లలో జరిగిన హోలీ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు జైసింహ, నరేష్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, రాకేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు బీఆర్ఎస్ అండ: జైసింహ

చిక్కడపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు, నాయకులకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ యువనేత ముఠా జైసింహ తెలిపారు. గాంధీనగర్ డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు, మాలబస్తీకి చెందిన గాలి వెంకటేష్ సతీమణికి ఈ మధ్యకాలంలో బైపాస్ సర్జరీ జరిగింది. శుక్రవారం జైసింహ వారి నివాసానికి చేరుకుని వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకోసం అంకితభావంతో పనిచేసే వారిని పార్టీ ఎప్పటికీ కూడా విస్మరించదని తెలిపారు. వెంకటేష్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు రాకేష్, నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్, సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, బస్తీవాసులు పప్పు, మల్లేష్, సాయి యాదవ్, హోప్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య



స్వప్న(ఫైల్)

రాజేంద్రనగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అత్తాపూర్ పాండురంగానగర్‌లో వివాహిత గురువారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక బీదర్ జిల్లా హుల్సూర్ తాలుకా, బేలూర్ గ్రామానికి చెందిన వీరాశెట్టి కుమార్తె స్వప్న(27)తో అదే ప్రాంతం హలాసీ గ్రామానికి చెందిన అమరేశ్‌తో 2022 జూన్ 20న వివాహమైంది. స్వప్నకు ఆయన సోదరుడు నాగశెట్టి 7 తులాల బంగారం, గృహోపకరణ వస్తువులతో పాటు రూ.50 వేలు కట్నంగా ఇచ్చారు. అమరేశ్ టిక్ టాక్ ఎంఎన్‌సీ కంపెనీలో పనిచేసేవాడు. పెళ్లయిన తర్వాత అమరేశ్, స్వప్నలు బీహెచ్ఈఎల్‌కు మకాం మార్చారు. ఆ తర్వాత బతుకుదెరువు కోసం అత్తాపూర్ పాండురంగానగర్‌కు వచ్చారు. వీరికి ఒకటిన్నర సంవత్సరాల పాప ఉంది. పాప పుట్టాక అమరేశ్ స్వప్నతో తరచూ గొడవ పడుతూ అదనపు కట్నం తేవాలని వేధించడం మొదలు పెట్టాడు. విషయం తెలుసుకున్న నాగశెట్టి రూ.50 వేలు ఇచ్చాడు. అయినా వేధింపులు ఆపలేదు. దీంతో స్వప్న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నాగశెట్టి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్వప్న ఆత్మహత్యకు అమరేశ్ వేధింపులే కారణమని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు దర్యాప్తు చేస్తున్నారు.